క్లుప్తంగా

ఘనంగా స్వాతి నక్షత్రోత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సిద్దిపేటరూరల్: పుల్లూరు స్వయంభూ లక్ష్మీన రసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయంలో నవకలశ అభిషేకం, సుదర్శన నారసింహ హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో దేవాలయ వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్య, పిడిచేటి రామకృష్ణచార్యులు, నచికేత్, సాయికృష్ణ, మాజీ చైర్మన్ రాములు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యూత్ జిల్లా అధ్యక్షుడిగా శ్రావణ్



నియామక పత్రం అందుకుంటున్న శ్రావణ్ గౌడ్

చిన్నకోదూరు(సిద్దిపేట): గౌడ సంఘం హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన శ్రావణ్ గౌడ్ నియమితులయ్యారు. ఆదివారం గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం గౌడ్, జిల్లా అధ్యక్షుడు సాయితేజ గౌడ్‌లు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ గౌడ్ మాట్లాడారు. గౌడ కుల హక్కుల సాధనలో భాగంగా జరిగే ఏ పోరాటనికైనా తాను ముందుంటానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీమంత్రి హరీశ్‌రావును కలిసిన నేతలు



మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన నేతలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మాజీ మంత్రి హరీశ్ రావును ఆదివారం జగదేవ్‌పూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, బుద్ద నాగరాజు, గణేశ్, కనకయ్య, సాయి, మహేశ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ వార్డు సభ్యుడు, యూత్ సీనియర్ నేత గణేశ్ జన్మదినం సందర్భంగా హరీశ్‌రావును శాలువాతో కప్పి సన్మానించారు.

బెజ్జంకి మండలాన్ని కరీంనగర్‌లో చేర్చండి

ఎమ్మెల్యేకు వినతి



మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో తిరిగి చేర్చాలని కరీంనగర్ జిల్లా పోరాట కమిటీ సభ్యులు మానాల రవి, డీవీ రావులు కోరారు. శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో మండలాన్ని కరీంనగర్‌లో తిరిగి చేర్చేందుకు చేసిన ఆందోళన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో బెజ్జంకి ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన జవాన్ గుండారం శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందగా.. అతని కుటుంబానికి రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. దేశం కోసం సేవలందించిన శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎక్స్ ఆర్మీసెల్ కన్వీనర్ చంద్రం తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: శివాజీనగర్‌లో ..



జగదేవ్‌పూర్: కొండపోచమ్మ ఆలయంలో..



గజ్వేల్‌లో..

జై బోలో గణేశ్ మహరాజ్‌కి..

వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాలకు విద్యుత్ దీపాలు, అలాగే స్వామివారికి ప్రత్యేక అలంకరణ గావించారు. ఉదయాన్నే మహిళలు మండపాల వద్దకు చేరుకొని పూజలు చేశారు. స్వామి వారి ఆశీర్వచనలు పొందారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయా మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. మరో ఎనిమిది రోజులపాటు నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వాహకులు నిర్వహించనున్నారు.



కొండపాక: కుకునూరుపల్లిలోని గణనాథునికి పూజలు చేస్తున్న సీఐ లతీఫ్



చిన్నకోడూరులో.. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడు



సిద్దిపేటరూరల్: పూజ కార్యక్రమంలో పాల్గొన్న యువకులు

రోడ్లు ఇలా.. నడవడం ఎలా?



పట్టణ పరిధిలోని 7వ వార్డులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



అంబేడ్కర్ చౌరస్తా వద్ద గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

- అధ్వానంగా పట్టణ రోడ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఉన్న రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కురుస్తున్న వర్షాలతో రోడ్లు బురదమయంగా మారాయి. పలు వార్డుల్లోని సీసీ రోడ్లపై వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఆ నీటిలోనే ప్రజలు నడవాల్సి వస్తోంది. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతుండటమే అందుకు నిదర్శనం. ఈ సమస్యలను పాలకవర్గం, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోయారు. పట్టణ కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వస్తుంటారు. వారు కూడా అధ్వాన రోడ్లతో ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

సంస్మరణ సభకు తరలిరండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి బాల్‌నర్సయ్య

కొండపాక(గజ్వేల్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సంస్మరణ సభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య కోరారు. ఈనెల 10 నుంచి 17 వరకు సభలు జరుగుతాయన్నారు. కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద సంస్మరణ సభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. నైజాం రజాకార్ల, భూస్వాముల, జాగీర్‌దార్ల పెత్తనం అణచి వేసేలా పోరాడి ఎందరో అమరులైనారన్నారు. అందులో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాటం చిరస్మరణీయమన్నారు. ఘనచరిత్రలు కలిగిన కమ్యూనిస్టు పార్టీ అమరుల త్యాగాలపై నిర్వహించే సంస్మరణ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కనకాచారి, తాటోజు రవింద్రచారి, కొమురయ్య, కనకయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పరిహారమివ్వాలి

బెజ్జంకి(సిద్దిపేట): వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని గుండారంలో ఆదివారం బీజేపీ నాయకులు క్షేత్ర స్థాయిలో వరి, పత్తి పంటలను పరిశీలించారు. వెంటనే ఎకరాకు రూ.25 వేల పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, హరీశ్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సోమవారం మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భానోతు జయరాం పేర్కొన్నారు. రైతు వేదికలో జరిగే కార్యక్రమానికి ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలన్నారు.

◆ స్నేహితుడి కుటుంబానికి అండగా ..

కొమురవెల్లి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. మండలంలోని గురువన్నపేటకు చెందిన అందె వీరేశం కుటుంబానికి నాగపురి ఉన్నత పాఠశాలలో 2001–02 విద్య సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఏదుల గణేశ్, మకిలి కనకయ్య, భిక్షపతి గౌడ్, బురుగు కనకరాజు, పుల్లరాయుడు, ప్రసాద్, రమేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన చెర్ల రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. బాధిత కుటుంబానికి అతని స్నేహితులు అండగా నిలిచారు. కాటు రాజు, మధుసూదన్‌రెడ్డి, మహమ్మద్ షరీఫ్, నవీన్‌కుమార్, స్వామి, పరుశురాములు, రఫీక్, బాబుగౌడ్, కరుణాకర్, సంతోశ్, గుంటి రమేశ్, మల్లేశం, రాజు, కుమార్, లింగం, బత్తుల కనకయ్య, గంటకొండ స్వామి, చంద సందీప్‌కుమార్‌లు కలిసి రూ.52 వేలను ఆదివారం బాధిత కుటుంబీకులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందజేశారు.

◆ వేలూరులో బీజేపీ సభ్యత్వ నమోదు

వర్గల్(గజ్వేల్): మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరం చేశారు. ఆదివారం వేలూరులో పార్టీ మండల అధ్యక్షుడు టీకులపల్లి బాల్‌రెడ్డి, కన్వీనర్ తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు నాగరాజు, రవీందర్, శివరాంగౌడ్, భాస్కర్, నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మైక్‌సెట్ వితరణ

గజ్వేల్‌రూరల్: మండలపరిధిలోని కొల్గూరులో గల శివాలయానికి మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి.. మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితి పురస్కరించుకొని గ్రామంలో గల శివాలయానికి మైక్‌సెట్ అందించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

◆ వారంతపు అంగడి ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని వట్టిపల్లిలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో వారంతపు అంగడిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రజిత రాజిరెడ్డి మాట్లాడారు. మూడు జిల్లాల సరిహద్దు గ్రామం కాబట్టి సంతకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

సిద్దిపేటజోన్: ప్రపంచ ఫిజియోథెరపిస్ట్ దినోత్సవం ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శుభం గార్డెన్స్‌లో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అలీ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విక్రమ్, హరిబాబు, వినయ్, మౌనిక పాల్గొన్నారు.

బీరప్ప ఆలయంలో చోరీ

మద్దూరు(హుస్నాబాద్): ఆలయంలో దొంగలు పడి హుండీని ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మండలంలోని సలాఖపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బీరప్ప ఆలయంలో దొంగలు పడి హుండీని ఎత్తుకెళ్లారు. అందులో సుమారు రూ. 3 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఆ మేరకు ఆలయ నిర్వాహకులు, కురుమ సంఘం పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయాన్ని ఎస్ఐ షేక్ మహబూబ్ సందర్శించి విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫీ విత్ గణపతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పర్యావరణాన్ని కాపాడుతూ, భక్తి భావాన్ని పొంపెందించాలనే లక్ష్యంతో సాక్షి ఆధ్వర్యంలో చేపట్టిన సెల్ఫీ విత్ '' మా ఇంటి మట్టి గణపతి''కి జిల్లాలోని భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. భక్తులు తమ ఇంట్లో మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేసిన అనంతరం తమ కుటుంబ సభ్యులతో కలిసి సెల్ఫీ తీసుకుని, సాక్షి వాట్సాప్‌కు పంపించారు. దీంతో పర్యావరణ హిత, భక్తి భావాన్ని పొంపెందించాలనే లక్ష్యం దిశగా జిల్లాలోని వినాయక భక్తులు ముందుకు సాగుతున్నారు.



సహస్ర, క్రితిక, ములుగు



గురువన్నపేటలో చిన్నారులు



సునీత, ప్రభుత్వ అధ్యాపకురాలు, సిద్దిపేట



రమ్యరవి, అలిరాజ్‌పేట



గొనే మార్కండేయులు, సిద్దిపేట



హర్షిత, పాలమాకుల



మధునాల సాత్విక్ సిద్దిపేట



శ్రీ సిద్ధిప్రియ వినాయక అసోసియేషన్, కుకునూరుపల్లి



సిద్దన్నపేట యూత్

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి ఉన్నత పాఠశాల 2013–14 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని బడిలోనే నిర్వహించారు. అందరూ ఒకే చోట చేరి నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం గ్రూపు ఫొటోలు దిగి సందడిగా గడిపారు.

డీజేలకు అనుమతి లేదు



సిద్దిపేటకమాన్: పట్టణంలోని వినాయక మండపం వద్ద ఏసీపీ మధు, సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సలహాలు, సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు మండపాలను వారు సందర్శించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనందోత్సవాల మధ్య ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులను జరుపుకోవాలని సూచించారు.

గజ్వేల్‌రూరల్: వినాయక నిమజ్జనం రోజున డీజేలకు అనుమతి లేదని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీజేల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణేశ్ మండపాల వద్ద, నిమజ్జనోత్సవ సమయంలో డీజేలు పెట్టడం వల్ల దాని ద్వారా వచ్చే పెద్దపెద్ద శబ్దాలతో ప్రజలకు, వృద్ధులకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు గుండెనొప్పి అవకాశముందన్నారు. డీజేల స్థానంలో సాధారణ శబ్దం వచ్చే రెండు బాక్సులను వినియోగించాలని సూచించారు. సుప్రీం కోర్టు ఆదేశానుసారం డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా వాటిని పెడితే చట్టప్రకారం కేసు నమోదు చేసి, సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండప నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అభిలాశ్ అన్నారు. మండలంలోని రాంచంద్రాపూర్‌లో వినాయక మండపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో డీజే ఆపరేటర్లను పిలిచి వినాయక చవితి కార్యక్రమంలో డీజేలకు అనుమతి లేవన్నారు. ఒకవేళ పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ప్రతీఒక్కరు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం రాత్రి 10 గంటల వరకు పూర్తి చేసుకోవలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.